ఆర్‌యూబీకి బాలారిష్టాలు

- వాహనాదారులకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఎల్‌సీ గేట్ వేయడంతో ఇరుక్కుపోయిన ద్విచక్రవాహనాదారులు


గేట్ ఓపెన్ చేసిన సమయంలో స్తంభించిన ట్రాఫిక్

గుంతకల్లు: పట్టణం మీదుగా వెళ్తున్న కల్లూరు రైలు మార్గంలోని గుంతకల్లు-హనుమన్ రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న ధర్మవరం ఎల్‌సీ గేట్ వద్ద చేపట్టాల్సిన ఆర్‌యూబీ (రోడ్డు అండర్ బ్రిడ్జి) నిర్మాణం బాలారిష్టాలు దాటలేక పోతుంది. గత ఏడాది ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించి టెండర్లు కూడ నిర్వహించారు. దీంతో 2024 మార్చిలో అప్పటి ఎమ్మెల్యే వై.వెంటకరామిరెడ్డి ఆర్‌యూబీ (యూ ఆకారంలో) నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడం.. ప్రభుత్వం మారడంతో ఆర్‌యూబీ నిర్మాణం పనులకు గ్రహణం పట్టింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు పూర్తయినా ఇంత వరకు ఇటు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. అటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ చొరవతో..

ధర్మవరం ఎల్‌సీ గేట్ గుంతకల్లు పట్టణంలో ప్రధాన ల్యాండ్ మార్కుల్లో అత్యంత ప్రముఖమైంది. గుంతకల్లు-కల్లూరు సెక్షన్‌లోని గుంతకల్లు-హనుమన్ రైల్వేస్టేషన్ మధ్య పట్టణంలోని కి.మీ 278/5-6, ఎల్‌సీ గేట్ నం.175 వద్ద ఏర్పాటైన లెవల్ క్రాసింగ్ గేట్‌ను ధర్మవరం గేట్‌గా పట్టణావాసులు పిలుస్తుంటారు. ఈ మార్గం గుండా నిత్యం పదుల సంఖ్యలో ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తుంటారు. రైళ్ల రాకపోకల సమయంలో గేట్ వేయడంతో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాదారులు ట్రాఫిక్ మధ్యలో ఇరుక్కుపోయి విసిగిపోతున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధర్మవరం ఎల్‌సీ గేట్ వల్ల వాహనాదారుల ఇబ్బందులతోపాటు పట్టణాభివృద్ధికి అవరోధంగా మారందన్న విషయాన్ని గుర్తించారు. దీంతో డీఆర్‌ఎం, జీఎం, రైల్వే బోర్డు స్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆయన కృషి ఫలితంగా ఆర్‌యూబీ నిర్మాణానికి రూ.10 కోట్లు కేటాయించి టెండర్లు కూడా పూర్తి చేశారు. వైవీఆర్ చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో పనులు చేపట్టలేకపోయారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే జయరాం, ఎంపీ అంబికా ఆర్‌యూబీ నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడంతో కథ కంచికి చేరదని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విసిగిపోతున్న వాహనాదారులు

భాగ్యనగర్, బెంచ్‌కోట్టాల, ఆలూరు రోడ్డు, శాంతి నగర్, ఆచారమ్మకోట్టాల తదితర కాలనీ ప్రజలు నిత్యం ధర్మవరం గేట్ దాటుకుని రావాల్సి ఉంది. స్కూళ్లు, ఆస్పత్రులకు, నిత్యవసర వస్తువులు కొనుగోలు తదితర పనులపై ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. గడిచిన మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకూ ఎల్‌సీ గేట్ గుండా రాకపోకలు సాగించాయి. ఈ కారణంగా ప్రతి పది నిమిషాలు ఒకసారి గేట్ పడుతుండటంతో భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. సరిగ్గా రాత్రి 7 గంటల సమయంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (బెంగళూరు-కలబురిగి) ఈ గేట్ మీదుగా వచ్చింది. గేట్ మ్యాన్ హరన్ చేస్తూ గేట్ వేసేందుకు ప్రయత్నించినా. వాహనాల కారణంగా రైలు మార్గం క్లియర్ కాలేదు. దీంతో రైల్వే కంట్రోల్ కార్యాలయానికి గేట్ మ్యాన్ అప్రమత్తం చేయడంతో ఎల్‌సీ గేట్ సమీపంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నిలిపారు. లేకపోతే పెనుప్రమాదం జరిగి ఉండేదని వాహనాదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ధర్మవరం ఎల్‌సీ గేట్ కారణంగా వాహనాదారులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఆర్‌యూబీ నిర్మాణానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులకు పట్టడం లేదు



రోజు రోజుకు పెరిగిపోతున్నా ట్రాఫిక్ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఆర్‌యూబీ నిర్మాణం పనులు ఇంత వరకు ప్రారంభం కాలేదు. ఎల్‌సీ గేట్ గుండా రాకపోకలు వెళ్లే సమయంలో ఇంటర్ లాకింగ్ సిస్టిమ్ కారణంగా రైల్వేస్టేషన్‌లోకి లాస్ట్ బోగి చేరే వరకు ఎల్‌సీ గేట్ ఎత్తలేరు. కనీసం రైళ్లు ఎల్‌సీ గేట్ దాటిన వెంటనే గేట్ ఎత్తేలా చర్యలు తీసుకుంటే, కొంత మేర ట్రాఫిక్ నియంత్రవచ్చు.

– మధు, లాయర్, గుంతకల్లు

సమస్య పరిష్కరించాలి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో మంజూరైన ఆర్‌యూబీ పనులు ఇంతవరకు చేపట్టకపోవడం బాధాకరం. ముస్లిం మతస్థులు ఎవరైన మృతి చెందినప్పుడు ఖననం చేయడానికి ఎల్‌సీ గేట్‌ను దాటుకుని వెళ్లాలి. ఆ సమయంలో గేట్ పడితే ట్రాఫిక్‌లో మృతదేహాన్ని మోసుకెళ్లాడానికి అవస్థలు పడుతున్నాం. మా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్‌యూబీ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి.

– చాంద్‌బాషా, 29వ వార్డు కౌన్సిలర్

'స్థానిక' ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గ్రామ కమిటీలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గురువారం పార్టీ మండల అధ్యక్షులు రాము ఆధ్వర్యంలో నాయకులు మండలంలోని గొల్లలదొడ్డి, గుండాల, అమీన్‌పల్లి, ఎన్.కొట్టాల, నరసాపురం, నక్కనదొడ్డి, తిమ్మాపురం, నక్కనదొడ్డి తండా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులతోపాటు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ విజయం కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు పెద్దినేని రంగనాయకులు, పంచాయతీ రాజ్ విభాగం కమిటీ అధ్యక్షుడు కసాపురం తిక్కస్వామి, మాజీ సింగిల్ విండో ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, గుంతకల్లు మండల ఉపాధ్యక్షుడు హనుమంతు, వైటీ చెరువు దశరథ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నక్కనదొడ్డి వెంకటేష్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, గొల్లలదొడ్డి సర్పంచ్ నారాయణస్వామి, మండల యూత్ విభాగం అధ్యక్షుడు శాంత నాయుడు, జయరామిరెడ్డి, గోసలుదుకి నగేష్, గోవిందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సత్య నారాయణరెడ్డి

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ విస్తృతంగా కృషి చేయాలని పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్య నారాయణరెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని శింగనమల నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, రైతు విభాగం అధ్యక్షుడు జయరామిరెడ్డి, చికెన్ నారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, వరికూటి కాటమయ్య పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థులకు టెక్నాలజీ అవసరం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: బీటెక్ చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక టెక్నాలజీపై అవగాహన అవసరమని బెంగళూరుకు చెందిన ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ శివకుమార్‌బాబు సూచించారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌టీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రాక్టీసింగ్ ఇంజినీర్ల కోసం టెక్నికల్ మీట్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ రఘుబాబు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శివకుమార్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక టెక్నికల్ రంగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నిర్మాణ వైఫల్యాలపై వివరణాత్మకంగా ప్రసంగించి ఆధునిక మౌలిక వసతుల సుస్థిరత, నిలకడ స్థిరత్వం కోసం సివిల్ ఇంజినీర్ల పాత్ర కీలకమన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ప్రొఫెసర్ శివ శంకర్‌బాబును సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ, అల్ట్రాటెక్ సిమెంట్ నిపుణుడు జైరాజ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ సీవీ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని వీఆర్‌ఏల ధర్నా



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

గుత్తి రూరల్: తమ డిమాండ్లను పరిష్కరించాలని మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు రెండు రోజుల ధర్నా కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు జగదీష్, యుగంధర్, చిరంజీవి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేసి కనీస వేతనం రూ.10.500 నుంచి రూ.21 వేలకు పెంచాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓ, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలన్నారు. రీసర్వే విధులు నిర్వహించే వీఆర్‌ఏలకు టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. ప్రభుత్వం నుంచి సానుకూలంగా స్పందన రాని పక్షంలో ఈ నెల 20న గుంతకల్లులోని ఆర్డీఓ కార్యాలయం, 22న అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల సంఘం నాయకులు రామ్‌ప్రసాద్, ధను, వినోద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

పామిడి: పామిడిలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులపై దాడిని దళిత సంఘం నాయకుడు సాకే ఓబులేసు గురువారం ఖండించారు. గురువారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులపై దాడిని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక మంజు టాకీస్ వీధిలో డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆదినారాయణ, ఆయన కుమారుడు హరికృష్ణ కులం పేరుతో దుర్భాషలాడడం అమానుషమన్నారు. వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, మండ్లరాజు, సుధీర్, మధు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యమే 'స్వస్థ్ నారీ సశక్త్' లక్ష్యం


గుత్తి మండలం మూముడూరులో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు


గార్లదిన్నె మండలం యర్రగుంట్లలో వైద్యశిబిరం నిర్వహించిన దృశ్యం

గుత్తి రూరల్/గార్లదిన్నె/యాడికి: కుటుంబం శక్తివంతంగా ఉండాలంటే ప్రతి మహిళా ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్ అన్నారు. గుత్తి మండలంలోని మాముడూరులో గురువారం స్వస్థ్ నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 105 మంది మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ వ్యాధి, మానసిక రోగాలపై పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధారాణి, వైద్య సిబ్బంది ఆంజనేయులు, సరస్వతి, సుధారాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలం యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించి 84మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికల్ కళా శాల డాక్టర్ రాజేంద్ర, పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్ కుమార్, హానీషా, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా యాడికి పీహెచ్‌సీ పరిధిలోని కమలపాడులో స్వస్థ నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి వ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి పరమేశ్వర, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గుత్తి: తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారం చేయాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు గురువారం గుత్తి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యనారాయణ, రామాంజనేయులు , ఉపాధ్యక్షుడు మహేష్ మాట్లాడారు. వెంటనే 12వ పీఆర్‌సీ వేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనాలు ఇవ్వాలని, అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ జబ్బార్‌మియాకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుంకన్న, రాజ్ కుమార్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదు


వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

పామిడి: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు అందజేస్తున్న వైద్య సేవల్లో లోపాలు తలెత్తరాదని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబదేవి హెచ్చరించారు. పామిడి మండలం గజరాంపల్లి గ్రామంలో ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డెమో త్యాగరాజ్, గంగాధర్, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

14వ వార్డులో పారిశుధ్య పనులు

గుంతకల్లుటౌన్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 14వ వార్డు సరస్వతీ విద్యామందిరం ఏరియాలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, కమిషనర్ నయీమ్, ఏసీ లక్ష్మీదేవి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ రంగమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, పీహెచ్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్షనర్స్ సంఘానికి రిటైర్డ్ హెచ్‌ఎం సురేష్ గురువారం రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వీరారెడ్డి, శివసుబ్రమణ్యం, సూర్యనారాయణరెడ్డి, కుళ్ళాయిరెడ్డి, వెంకటరామయ్య పాల్గొన్నారు.

కోనుప్పలపాడులో పశువైద్య శిబిరం

యాడికి: రాష్ట్రీయ గోకుల్ మిషన్-పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కోనుప్పలపాడులో గురువారం ఉచిత గర్భ కోశ పశు వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పశు గణాభావృద్ధి సంస్థ ఈఓ వెంకటేష్ మాట్లాడుతూ పాడి రైతులు లింగ నిర్ధారిత వీర్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీ ఖాదర్‌బాషా, తాడిపత్రి డాక్టర్ పద్మనాభం, శింగనమల డాక్టర్ శ్రీకాంత్, యాడికి పశు వైద్యులు సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో బుగ్గ రామలింగేశ్వరుడు



తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారికి అర్చకులు పుష్పాలంకరణ సేవ చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకాల అనంతరం పట్టు వస్త్రంతో పుష్పాలంకరణ చేశారు. స్వామిని భక్తులు దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

క్లుప్తంగా

డప్పు కళాకారులను ఆదుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: ప్రభుత్వం తమను ఆదుకోవాలని డప్పు కళాకారులు డిమాండ్ చేశారు. తాడిపత్రి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం డప్పు కళాకారులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు కళాకారుల సమస్యలపై నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డప్పు కళాకారులకు రూ.7 వేలు ఫించన్ అందజేయాలని, గజ్జలు, యూనిఫాం అందజేయాలన్నారు. ఇంటి కోసం 3 సెంట్ల స్థలం, మూడు ఎకరాల భూమిని అందజేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఈఓపీఆర్‌డీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మండల కార్యదర్శి శ్రీరాములు, పట్టణ కార్యదర్శి రామ్మోహన్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు ఉమాగౌడ్, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

హైవే పనుల పరిశీలన


హైవే రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మండలంలో జరుగుతున్న 544 డీ హైవే పనులను గురువారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, తేరన్నపల్లి, అవులతిప్పాయపల్లి తదితర గ్రామ పరిధిలో జరుగుతున్న పనుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హైవే పనులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

పరామర్శ


పేరం స్వర్ణలతను పరామర్శిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో వైఎస్సార్ సీపీ మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత అనారోగ్య కారణంగా చికిత్స తీసుకుని ఇంటిలో విశాంత్రి తీసుకుంటుండగా గురువారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితులపై మాజీ ఎమ్మెల్యే ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థికి అభినందనలు


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గుంతకల్లుటౌన్: ఢిల్లీలో 15 రోజుల పాటు లిండియా తల్‌సైనిక్ క్యాంపును విజయవంతంగా పూర్తి చేసిన ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్‌సీసీ విద్యార్థి హెచ్.మల్లికార్జునను ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. క్యాంప్ అనంతరం గురువారం కళాశాలకు విచ్చేసిన మల్లికార్జునకు అధ్యాపకులు, విద్యార్థులు స్వాగతం పలికారు. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు క్యాంప్‌లో పాల్గొనగా అందులో మల్లికార్జున ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్, అధ్యాపకులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ గోపినాయక్, రవిశంకర్ శర్మ, జమీలాబీ, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు

గుంతకల్లు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ర్యాంకులు సాధించాలని శ్రీ శంకర నంద గిరి స్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కళాశాలలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగం పలికారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, బీ.క్రిష్ణయ్య, ఖాజావలి, రాకేష్, శివయ్య, డాక్టర్ వైశాలి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆలూరు' ఎంపికపై సంబరాలు


కేక్ కట్ చేసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

శింగనమల: శింగనమల నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డిని పార్టీ స్టేట్ అడ్మిన్ హెడ్‌గా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, యువజన విభాగం నాయకులు బాణా సంచాలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. గురువారం శింగనమలలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ వెంకట్రాముడు, మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నవీన్, నాగవర్ధన్, రాజు, శ్రీకాంత్ జగన్, సాయి, చంద్రమౌళి యాదవ్, మనోజ్‌కుమార్, భాషా, బెస్త ప్రసాద్, మసూద్, బెస్త అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీలో కానుకలను లెక్కించారు. 2024 నవంబర్ 27 నుంచి 2025 సెప్టెంబర్ 18వ తేదీ వరకూ రూ.6,64,995 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో అనంతపురం డివిజన్ దేవదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి, ఈఓ రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శైలజానాథ్‌కు పరామర్శ


శైలజానాథ్‌ను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి తదితరులు

యల్లనూరు: జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, శింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్‌ను గురువారం పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, యల్లనూరు జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి పంపరామర్శించారు. కార్యక్రమంలో నాయకుడు భోగతి నాగేశ్వరరెడ్డి, కాంట్రాక్టరు రియాజ్ తదితరులు ఉన్నారు.

క్షణికావేశానికి లోను కావద్దు

గుంతకల్లుటౌన్: 'ప్రతి సమస్యకూ చావే పరిష్కారం కాదు. ఆత్మహత్యకు ప్రేరేపించిన పరిస్థితుల కంటే దానిని అధిగమిస్తే వచ్చే బంగారు జీవితం గురించి ఒక్కసారి ఆలోచించాలి' అని ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సునీత, పి.జ్యోతి అన్నారు. గురువారం సరోజినినాయుడు మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో బలవన్మరణాల నివారణ-మానసిక సమతుల్యతపై అవగాహన సదస్సు నిర్వహించి, అనంతరం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకరయ్య, అభయ విద్యానిధి ట్రస్ట్ ఫౌండర్ వసుంధరాదేవి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రతినిధులు ఇందిరా, శాంత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పెద్దవడుగూరు: చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని చింతల చెరువు అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలల్లో ఊబకాయం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులు 'పెన్ డౌన్'

గుత్తి: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశ పెట్టిన కొన్ని విధానాల వల్ల డాక్యుమెంట్ రైటర్లు ఇబ్బందులకు గురి కావలసి వస్తుందని, నూతన విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం, శనివారం పెన్ డౌన్ నిర్వహిస్తామని డాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గురువారం కాసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్యుమెంట్ రైటర్లు బండి సత్య, అనంత, శ్రీకరం నరేష్ రాయల్, రఘు తదితరులు మాట్లాడారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ వంటి లోప భూయిష్టమైన విధానాల వల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ మంజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు కేశవ, తాజుద్దీన్, రామకృష్ణ, ఇలియాజ్, రంగస్వామి, నిరంజన్, రమణ తదితరులు పాల్గొన్నారు.